క్లుప్తంగా

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



కుమ్మరిపల్లిలో క్షీరాభిషేకం చేస్తున్న దివ్యాంగులు

రాయికల్: ప్రభుత్వం దివ్యాంగులకు పింఛన్ రూ.వెయ్యి పెంచడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం రాయికల్ మండలం కుమ్మరిపల్లిలో దివ్యాంగులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దొంతి నాగరాజు, వార్డు సభ్యులు అంజయ్య, నాయకులు పంచతి చిన్నమల్లయ్య, కొడిమ్యాల బాలయ్య, దొంతి రాజేందర్, రాజం, పెద్ద నర్సయ్య, కమల, లక్ష్మి పాల్గొన్నారు.

విద్యా వ్యాపారాన్ని ప్రోత్సహిస్తున్న అధికారులు



మాట్లాడుతున్న సంజయ్

జగిత్యాల: ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల్లో ముందస్తు అడ్మిషన్ల పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యను వ్యాపారం చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సంజయ్ అన్నారు. కార్యాలయంలో మాట్లాడుతూ పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, టైబెల్టులు అమ్ముతున్నారని, నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తూ పాఠశాలలకు ఒలంపియాడ్, ఈటెక్నో, డీజీ, ఐఐటీ, గ్లోబల్ వంటి తోకపేర్లు పెడుతూ విద్యార్థులను మోసం చేస్తున్నారన్నారు. ఇప్పటికీ కొన్ని పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేవన్నారు. వెంటనే వీటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సాయి, నీరజ్, మనీష్, వేణు పాల్గొన్నారు.

డీఈవో దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

కోరుట్ల:పట్టణంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో జిల్లా విద్యాధికారి దిష్టి బొమ్మను బుధవారం దహనం చేశారు. ఈ సంర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ జగిత్యాలలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న శ్రీ చైతన్య స్కూల్‌కు డీఈవో కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. కార్పొరేట్ పాఠశాలకు కనీస పార్కింగ్ సౌకర్యం లేకున్నా అనుమతులు ఇచ్చారని పేర్కొన్నారు. డీఈవోకు ఎన్నోసార్లు విన్నవించినా పట్టించుకోవటం లేదన్నారు. కార్యక్రమంలో పట్టణ ఏబీవీపీ కార్యదర్శి సునీల్, సాయికుమార్, సాయి ప్రసాద్, పవన్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ నిధితో ఉపాధ్యాయ కుటుంబాలకు భరోసా



సభ్యత్వం తీసుకున్న ఉపాధ్యాయులు

మెట్‌పల్లి: ఉపాధ్యాయ కుటుంబాలకు భరోసా ఇవ్వడానికే సంక్షేమ నిధిని ఏర్పాటు చేసినట్లు యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిరుక్కోవెల శ్యాంసుందర్ అన్నారు. పట్టణంలోని పలు పాఠశాలల్లో బుధవారం సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు ముందుకు వచ్చి సభ్యత్వాలను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంబటి భూమేశ్వర్, అయిటి సుశీల, తులసీ ఆగమయ్య, పిట్టల రాజేందర్, లోకిని కృష్ణయ్య, జయభారతి, నగేశ్ పాల్గొన్నారు.

ఎస్సైగా బాధ్యతలు స్వీకరణ



నరేశ్, ఎస్సై

గొల్లపల్లి: మండల ఎస్సైగా నరేశ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. పోలీస్ సిబ్బంది నూతన ఎస్సైకి శుభాకాంక్షలు తెలిపారు.ఇక్కడ పనిచేస్తున్న ఎస్సై దత్తాద్రి ధర్మపురి పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు.

రైతన్నకు నకిలీ విత్తనాల బెడద

- నాసిరకం విత్తనాలు, ఎరువులతో మోసపోతున్న రైతులు
- జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్న వ్యవసాయ అధికారులు
- షాపుల్లో అధికారుల తనిఖీలు



షాపుల్లో తనిఖీ చేస్తున్న వ్యవసాయ, పోలీస్ శాఖ అధికారులు

గొల్లపల్లి: అన్నదాతలు వానాకాలం పంటలసాగుకు సన్నద్ధమవుతున్నారు. దుక్కులు దున్ని పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేస్తున్నారు. అయితే మార్కెట్లో నకిలీల బెడద ఎక్కువ ఉన్నందునా రైతులు అప్రమత్తంగా లేకుంటే మోసపోయే ప్రమాదం ఉంటుంది.అధిక లాభాల కోసం వ్యాపారులు నాసిరకం ఎరువులు, విత్తనాలు అంటగట్టే అవకాశాలు లేకపోలేదని, రైతులు వాటిపై అవగాహన పెంచుకుని జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

విత్తనాలు కొనే ముందు జాగ్రత్తలు..

- వ్యవసాయ శాఖ లైసెన్స్ పొందిన డీలర్ల నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలి.
- విక్రయదారుడు ఇచ్చే కరపత్రాలు తీసుకుని వాటిలో పేర్కొన్న అంశాలు చదవాలి.
- బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి.
- బిల్లుపై విక్రయదారుడి పేరు,కేంద్ర, రాష్ట్ర అమ్మకపు పన్ను నంబర్, రైతు పేరు, గ్రామం పేరు, విక్రయదారుడి సంతకం, తేదీలు, రకం బ్యాచ్ నంబర్, గడువు తేదీలు,నికర తూకం, కంపెనీ పేరు ఉన్నాయో లేవో సరి చూసుకోవాలి.
- అరువు పద్ధతిలో కొనుగోలు చేసినా తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలి.
- విడిగా ఉన్న సంచులు,పగిలిన ప్యాకెట్లు, తెరిచి డబ్బాల విత్తనాలు కొనవద్దు.
- కొనుగోలు చేసే ప్యాకెట్ సీసీ, డబ్బాలపై సీలు ఉందో లేదో నిర్ధారించుకోవాలి.
- కొనుగోలు చేసిన సరుకును డీలర్ వద్దే తూకం వేయించాలి.
- విత్తనాలు కొనుగోలు చేసిన బిల్లులను పంటకాలం పూర్తయ్యే వరకు దాచిపెట్టుకోవాలి.
- విత్తనాలు కొనుగోలు చేసి ఇంటికి తెచ్చిన తరువాత మొలక శాతాన్ని చూసుకోవాలి.
- మొలక శాతం సంతృప్తి కరంగా ఉంటేనే విత్తనాలను వాడుకోవాలి.

ఎరువులు తీసుకునే టప్పుడు..

- అర్హత కలిగిన డీలర్ల నుంచి ఎరువులు కొనుగోలు చేయాలి.
- మిషన్ కుట్టుతో ఉన్న సంచులనే ఎంచుకోవాలి.
- ఒకవేళ చేతికట్టు ఉంటే సీల్ ఉందో లేదో చూసుకోవాలి.
- ప్రామాణిక పోషకాల వివరాలు, ఉత్పత్తి చేసిన సంస్థ ఉత్పత్తి దారుడి పేరు ఉంటేనే కొనాలి.
- చిల్లులు పడి చిరిగిన బస్తాలను తీసుకోవద్దు.
- అన్య పదార్థాలు కలిస్తే కల్తీగా గుర్తుంచుకోవాలి.
- కొనుగోలు సమయంలో డీలర్ రికార్డులో రైతు విధిగా సంతకం చేయాలి.
- ఎరువుల నాణ్యతపై అనుమానం ఉంటే వెంటనే వ్యవసాయ శాఖ అధికారి సహాయంతో పరీక్షకు పంపాలి.
- పురుగుమందులు...
- వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు శాస్త్రవేత్తల సూచనల మేరకు పురుగుమందులు కొనాలి.
- క్రిమి సంహారక డబ్బాలపై డైమండ్ ఆకారంలో పురుగుమందు స్థాయిని తెలిపే రంగులు ఉంటాయి.
- అత్యంత విషపూరితమైతే ఎరుపు రంగు. విషపూరితమైతే నీలం రంగు, స్వల్ప విషపూరితమైతే ఆకుపచ్చ రంగు గుర్తులు ఉంటాయి.
- పురుగులమందులు రెండు మూడు రకాలు కలిపి వాడరాదు.
- వాడిన డబ్బాలు,సీసాలను ధ్వంసం చేసి గోతిలో పూడ్చి పెట్టాలి.
- పురుగుమందులు వాడకానికి వినియోగించిన పాత్రలను ఇతర అవసరాలకు ఉపయోగించొద్దు.

సూచనలు పాటించాలి



వానాకాలం పంటల సాగుకు వినియోగించే విత్తనాలు, ఎరువులపై రైతులు అవగాహన కలిగి ఉండాలి. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహాలు తప్పనిసరిగా పాటించాలి. నకిలీ విత్తనాల పట్ల జాగ్రత్త వహించాలి. ఫర్టిలైజర్ల షాపుల్లో తనిఖీలు చేపట్టాం. నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటాం.

కరుణ, వ్యవసాయ అధికారి, గొల్లపల్లి

ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు

- కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు



న్యూట్రిషన్ కిట్ అందిస్తున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

కోరుట్ల: రాష్ట్రం ఏర్పాటైన తర్వాత ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలో వైద్యారోగ్య దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు పోటీ పడి నార్మల్ డెలివరీలు చేస్తున్నారని పేర్కొన్నారు. కోరుట్లలో 100 పడకల ఆస్పత్రి నిర్మాణం జరుగుతోందన్నారు. గడిచిన 9 ఏళ్లలో రాష్ట్రంలోని ప్రభుత్వాసుపత్రుల్లో అనేక సదుపాయాలు కల్పించామన్నారు. అదనపు కలెక్టర్ బీ.ఎస్. లత మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలు చాలా మెరుగు పడ్డాయన్నారు.రక్త హీనత తగ్గించేందుకు న్యూట్రిషన్ కిట్స్ అందజేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వినోద్ కుమార్, ప్రత్యేక అధికారి శ్రీనివాస్, జిల్లా రైతుబంధు అధ్యక్షుడు చీటి వెంకట్రావు, సర్పంచుల ఫోరం జిల్లా గౌరవ అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, మున్సిపల్ చైర్మన్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, వైద్యాధికారులు, నాయకులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయానికి భూమిపూజ

పట్టణంలోని కల్లూర్ రోడ్‌లో నూతనంగా నిర్మించే తహసీల్దార్ కార్యాలయ భవనానికి ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు బుధవారం భూమిపూజ చేశారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య, ఎంపీపీ తోట నారాయణ, జిల్లా రైతుబంధు అధ్యక్షుడు చీటి వెంకట్రావు, సర్పంచుల ఫోరం జిల్లా గౌరవ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు అన్నం అనిల్, కౌన్సిలర్లు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

కోరుట్ల రూరల్: మండలంలోని పైడిమడుగులో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన రేణుకాఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు బుధతవారం ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దమ్మ బీమారెడ్డి, ఎంపీటీసీ మాదురి, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

సుపరిపాలన కోసం బీజేపీకి అండగా నిలవాలి



సమావేశంలో మాట్లాడుతున్న గంగారెడ్డి

మెట్‌పల్లి: దేశంలో సుపరిపాలన కోసం బీజేపీకి అండగా నిలవాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి కోరారు. పట్టణంలోని వాసవీ గార్డెన్‌లో మహాజన్ సంపర్క్ అభయాన్‌లో భాగంగా బుధవారం నిర్వహించిన బీజేపీ అనుబంధ విభాగాల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో మోసపూరిత హామీలను ఇచ్చి గెలుపొందిన బీఆర్ఎస్ రాష్ట్రంలో అవినీతి పాలన సాగిస్తోందని విమర్శించారు. బీజేపీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలన్నారు. నవభారత్ నిర్మాణం కోసం యువత బీజేపీలో చేరాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరావు, నియోజకవర్గ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్, ఉమ్మడి జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, జేఎన్ వెంకట్, సురభి నవీన్ కుమార్, గద్దె భూమన్న, బద్దం గంగాధర్, బొడ్ల రమేశ్, దొనికెల నవీన్ పాల్గొన్నారు.

జగిత్యాలటౌన్: బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలోని పద్మనాయక కల్యాణ మంటపంలో మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ తొమ్మిదేళ్ల పాలనలో అన్ని వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి, పన్నాల తిరుపతిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అందరికీ మెరుగైన వైద్యానికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, జెడ్పీచైర్‌పర్సన్

జగిత్యాల: అందరికీ మెరుగైన వైద్యం అందాలనే ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, మాతా శిశు సంక్షేమ కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ప్రభుత్వ ఆస్పత్రిలోని వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని, సీఎం కేసీఆర్ పేదల కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారని, కార్పొరేట్‌స్థాయిలో ఆస్పత్రులు ఉన్నాయన్నారు. జెడ్పీచైర్ పర్సన్ దావ వసంత మాట్లాడుతూ, ఆస్పత్రుల్లో ప్రస్తుతం పేద వారి కోసం అన్ని రకాల మౌలిక వసతులున్నాయని, ఒక రూపాయి ఖర్చు లేకుండా మెరుగైన వైద్యం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ హరిచరణ్‌రావు, రాజ్‌కుమార్, జెడ్పీటీసీ మహేశ్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ శివరాం ప్రసాద్, సూపరింటెండెంట్ రాములు పాల్గొన్నారు.

రక్తదానం ఎంతో గొప్పది

రక్తదానం ఎంతో గొప్పదని, దీని ద్వారా ఒకరి ప్రాణాలు కాపాడవచ్చని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆపీ, రోటరి క్లబ్‌ల ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని శిబిరం నిర్వహించారు. ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలని కోరారు. కార్యక్రమంలో నిర్వాహకులు మంచాల కృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

జగిత్యాలరూరల్: ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. బుధవారం జగిత్యాల అర్బన్ మండలం అంబారిపేటలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మహేశ్, సర్పంచ్ గంగాధర్, ఎంపీటీసీ మల్లారెడ్డి, ఉపసర్పంచ్ నారాయణ, అర్బన్ మండల రైతుబంధు కన్వీనర్ జుంబర్తి శంకర్, నాయకులు పాల్గొన్నారు.

పెట్రోల్ పంపు ప్రారంభం

సారంగాపూర్: మంలంలోని నాగునూర్‌లో బుధవారం జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ హెచ్‌పీ పెట్రోల్, డిజీల్ పంపులను జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, ఎంపీపీ కోల జమున, జెడ్పీటీసీ మేడిపల్లి మనోహర్‌రెడ్డి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ వొద్దినేని హరిచరణ్‌రావు, ఉమ్మడి జిల్లా కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, సర్పంచ్ దమ్మ గంగు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో దశాబ్ది ఉత్సవాలు



దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న వైద్యులు

రాయికల్: పట్టణంలోని వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం వైద్య ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటిండెంట్ రవి ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈఎన్టీ వైద్యులు రమేశ్, డాక్టర్ నరేంద్ర, వైద్య సిబ్బంది మమత, ప్రణీత, మంజుల, ఏఎన్ఎం విజయలక్ష్మి, ఫార్మాసిస్ట్ ఖలీం, ల్యాబ్ టెక్నీషియన్ రంజిత్ పాల్గొన్నారు.

సారంగాపూర్ పీహెచ్‌సీలో..

సారంగాపూర్: మండలంలోని సారంగాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం రోగులకు పళ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య రక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి రాణి మైత్రీ రెడ్డి, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

రక్తదాతకు గవర్నర్ పురస్కారం



జగిత్యాల: జిల్లాకు చెందిన తుమ్మనపల్లి బాలకృష్ణ ఇప్పటి వరకు 63 సార్లు రక్తదానం చేసి పలువురికి ప్రాణదానం చేశారు. రక్తదాన దినోత్సవం సందర్భంగా బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. బాలకృష్ణ గవర్నర్ నుంచి పురస్కారం అందుకోవడం పట్ల రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యుడు మంచాల కృష్ణ, పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఉత్తమ రక్తదాతకు సన్మానం

కోరుట్ల: పట్టణానికి చెందిన ఎండీ అమేర్‌ను ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ ప్రతినిధులు బుధవారం జగిత్యాలలో సన్మానించి ప్రశంసా పత్రం అందజేశారు.అమేర్ లియో క్లబ్ ద్వారా అత్యవసర సమయంలో రక్తదానం చేసే విదంగా, సమాజంలో రక్త దానంపై ఉన్న అపోహలు తొలగిస్తూ రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నరని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అమేర్‌ను సత్కరించి ప్రశంసాపత్రం అందజేశారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



ఎంఈవోకు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

కోరుట్ల రూరల్: ఉపాధ్యాయులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో బుదవారం ఎంఈవో గంగుల నరేశంకు వినతిపత్రం అందించారు. విద్యార్థులకు సకాలంలో పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్‌లు అందించాలని, ప్రతీ నెల మెదటి తేదీన మధ్యాహ్న భోజన బియ్యం సరఫరా చేయాలని, మన ఊరు మనబడి పథకానికి ఎంపికైన పాఠశాలల్లో మిగులుగా ఉన్న ఫర్నీచర్ ఎంపిక కాని పాఠశాలలకు సరఫరా చేయాలని కోరారు. పదో తరగతి పరీక్ష విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు అర్జిత సెలవులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ నాయకులు అంబటి భూమేశ్వర్, సిరిపురం శ్రీనివాస్, శ్యామకూర శ్రీనివాస్, చిరంజీవి, అనిల్ కుమార్, ఒజ్జ శ్రీనివాస్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం

కథలాపూర్: మండలంలోని బొమ్మెన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ముందుగా సరస్వతి పూజ చేశారు. అనంత రం చిన్నారులకు అక్షరాలు దిద్దించారు. పాఠశాలలో చేరిన 15 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించామని ఉపాధ్యాయులు తెలిపారు.కార్యక్రమంలో హెచ్‌ఎం అంబటి రవి, ఉపాధ్యాయులు సా యిరెడ్డి, లక్ష్మణ్, రమేశ్, శిరీషా, రాజేశ్వరి పాల్గొన్నారు.

రాయికల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బుధవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఆలూరులో జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్లు రాజేశం, మహేశ్, సత్యనారాయణ పాల్గొని చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్లు పైబడిన చిన్నారులందరినీ ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ సురేందర్, ఉపసర్పంచ్ పద్మ, రాంరెడ్డి, హెచ్‌ఎం సాయికృష్ణ, ఉపాధ్యాయులు కిశోర్, కవిత, శృతి పాల్గొన్నారు.

గొల్లపల్లి: మండలంలోని దట్నూర్ ప్రాథమిక పాఠశాలలో బడిబాటలో భాగంగా రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత జూపాక సుదర్శన్ ఆధ్వర్యంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉచితంగా పలకలు అందజేసి అక్షరాభ్యాసం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆకుల పావని, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ చేనేత ఐక్యవేదిక మండల అధ్యక్షుడిగా అశోక్



కథలాపూర్: జాతీయ చేనేత ఐక్యవేదిక మండల అధ్యక్షుడిగా కథలాపూర్ గ్రామానికి చెందిన చిలుక అశోక్‌ను నియమిస్తూ జిల్లా నాయకులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అశోక్ పద్మశాలీ సంఘం బలోపేతానికి కృషి చేస్తూ, యువకులను చైతన్యపరచి పలు సామాజిక కార్యక్రమాల్లో పాలుపంచుకునేలా ప్రోత్సహించినందుకు మండల అధ్యక్షుడిగా నియమించినట్లు పేర్కొన్నారు. తన నియామకానికి కృషి చేసిన జిల్లా, రాష్ట్ర నాయకులకు అశోక్ కృతజ్ఞతలు తెలియజేశారు.

రైతు వేదిక ఉన్నా.. రోడ్డు పక్కనే సమావేశం



సమావేశంలో నేలపై కూర్చున్న రైతులు

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేటలో రైతులతో సమావేశం ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా అన్ని వసతులతో ప్రభుత్వ నిధులు రూ. 22 లక్షలు వెచ్చించి రైతు వేదిక నిర్మించారు. కానీ బుధవారం గ్రామపంచాయతీ సమీపంలో రోడ్డు పక్కనే రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయిల్‌పామ్ సాగు గురించి రైతులకు అధికారులు వివరించడం విశేషం. రైతు వేదికల్లో రైతులతో సమావేశం ఏర్పాటు చేయాల్సి ఉండగా.. పాత పద్ధతిలోనే నేలపై కూర్చుండి సమావేశం నిర్వహించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై మండల వ్యవసాయ అధికారి యోగితా వివరణ ఇస్తూ... రైతు వేదిక గ్రామానికి కాస్తా దూరంగా ఉండటంతో రైతులు అక్కడికి రావడం లేదని, గ్రామపంచాయతీ సమీపంలో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

బాధిత కుటుంబాలకు అండగా ఫ్రెండ్స్ వెల్ఫేర్ ట్రస్ట్

మల్లాపూర్: మండలంలోని రాఘవపేటలో బుధవారం బాధిత కుటుంబాలకు ఫ్రెండ్స్ వెల్ఫేర్ ట్రస్ట్ అండగా నిలిచింది. ట్రస్ట్ అధ్యక్షుడు సుర్గి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలకు బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. రాఘవపేటలో ఇటీవల కురిసిన ఈదురుగాలుల వర్షానికి పులి గంగాధర్, పులి సుగుణ ఇళ్లు దెబ్బతినడంతో బాధిత కుటుంబాలను పరామర్శించి నెలకు సరిపడా బియ్యం, నిత్యవసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, రైతుబంధు కమిటీ మండల సభ్యుడు బోయిని సిద్దయ్య,ఫ్రెండ్స్ వెల్ఫేర్ ట్రస్ట్ సభ్యులు విజయ్, అభి, రవితేజ పాల్గొన్నారు.

20న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలి

ఇబ్రహీంపట్నం: మండలంలోని పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం పంపించిన ఉచిత పాఠ్యపుస్తకాలను ఈనెల 20న పంపిణీ చేయాలని ఇన్‌చార్జి ఎంఈవో ఆనందరావు కోరారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం వద్ద మండలంలోని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్సీ కార్యాలయ సిబ్బంది కార్తీక్, అశోక్, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘ భవనం ప్రారంభం

కోరుట్ల: పట్టణంలోని 23వ వార్డులో నూతనంగా నిర్మించిన ముదిరాజ్ సంఘ భవనాన్ని బుధవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ప్రారంభించారు.కార్యక్రమంలో కౌన్సిలర్ పి.ఉమాదేవి,ముదిరాజ్ నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన సాఫ్ట్‌బాల్ వేసవి శిక్షణ శిబిరం

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ జెడ్పీ పాఠశాలలో మే 1 నుంచి నిర్వహించిన సాఫ్ట్‌బాల్ వేసవి శిక్షణాశిబిరం బుధవారం ముగిసింది. క్రీడాకారులు హేమంత్, వై భవ్, చోటు, భానుప్రకాశ్, కార్తీక్, సురేశ్, హితేశ్, స న్ని, కిరణ్, శ్రావణ్, అరుణ్, మహేశ్ పాల్గొనగా, వారికి సీనియర్ క్రీడాకారుడు సాయికృష్ణ శిక్షణ ఇచ్చారు.

విద్యార్థినికి అభినందన

జగిత్యాల: నీట్ ఫలితాల్లో అల్ఫోర్స్ జూనియర్ కళాశాలకు చెందిన కాస్య స్ఫూర్తి 459 మార్కులతో 69,447 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి విద్యార్థిని అభినందించారు.

19 నుంచి జగన్నాథస్వామి బ్రహ్మోత్సవాలు

సారంగాపూర్: మండలంలోని రేచపల్లి నీలాచల కొండలపై వెలసిన శ్రీ భూదేవి నీలాదేవి సమేత జగన్నాథస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 19 నుంచి 24 వరకు జరుగుతాయని ఆలయ అర్చకులు, గ్రామస్తులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆరు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో 19న ఉత్సవాలు ప్రారంభమవుతాయని, 24న రథోత్సవం ఉంటుందని తెలిపారు.

ఈదురుగాలులకు కూలిన ఇంటి పైకప్పు

మల్లాపూర్: మండలంలోని రత్నాపూర్‌లో బుధవారం రాత్రి ఈదురుగాలులకు ఇంటి పైకప్పు కూలిపోయింది. గ్రామంలోని బక్కూరి శేఖర్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. శేఖర్ గల్ఫ్ దేశాలకు వలస వెళ్లి కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఏడాది క్రితం గల్ఫ్ నుంచి వచ్చి ఇల్లు నిర్మించుకున్నాడు. బుధవారం రాత్రి ఈదురుగాలులకు ఇంటి పైకప్పు కూలిపోయింది. కుటుంబంతో సహా బయటకు పరుగులు తీయడంతో తృటిలో ప్రమాదం తప్పింది. బాధితుడికి సుమారు రూ.5 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని స్థానికులు కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

వెల్గటూర్: మండలంలోని కుమ్మరిపల్లి ఆదర్శ పాఠశాలలో అవర్ బేసిస్ ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కట్ల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, హిందీ, సాంఘికశాస్త్రం బోధించుటకు డిగ్రీ, బీఈడీ లేదా హిందీలో హెచ్‌పీటీ పూర్తిచేసి ఉండాలి, ఇంటర్ విద్యార్థులకు బోటనీ, ఆంగ్లము బోధించుటకు ఎమ్మెస్సీ బీఈడీ, ఎంఏ బీఈడీ పూర్తి చేసిన వారు వారి ధ్రువీకరణ పత్రాలను ఈ నెల 22 లోపు పాఠశాలలో సమర్పించాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

గొల్లపల్లి: గొల్లపల్లి మోడల్ స్కూల్‌లో టీచర్ల ఖాళీ పోస్టులకోసం తాత్కాలిక టీచర్ల భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఈరవేని రాజ్‌కుమార్ తెలిపారు.పీజీటీ ఇంగ్లిష్, సివిక్స్, టీజీటీ సోషల్, ఇంగ్లిష్, హిందీ, పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. అర్హులైన వారు ఈ నెల 17 మధ్యాహ్నం 12 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 17న జరిగే డెమో ఇంటర్వ్యూకు హాజరుకావాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.